# ఇమిటేషన్ ★

రచన:
నందివాడ కామేశ్వరరావు

ఈనాడు ఇమిటేషన్ అంటే యెరగని వాళ్ళే వుండరని నా వుద్దేశం. ఎందు చేతనంటే యీ సినీమాప్రపంచములో ఇమిటేషన్ అనేది ప్రతీవాళ్ళదగ్గర కనిపిస్తూనే వుంటుంది. ఏదో ఒక సినీమాలో రామశర్మ ఆడవాళ్ళ రవికలకుడ్డ బుష్‌కోటుగా తొడుక్కున్నాడంటే, యీనాడు కాలేజీవిద్యార్థులంతా రవికలగుడ్డతో బుష్‌కోట్లు కుట్టించేసుకుంటున్నారు. ఈమధ్యను ఒక హిందీ చిత్రంలో ఒకతార చేతులులేని జాకెట్టు తొడుక్కొని నటించిందని కొందరు స్త్రీలు అదే పద్ధతి మొదలుపెట్టేరు. అయితే ఇంట్లో అమ్మలక్కలు వూరుకుంటారా మరి! ఆదేం ఖర్మమే కోడలా! జబ్బలు కనిపించుకుంటూ జాకెట్టు నువ్వూను. ఇదెక్కడి ఫాషన్లు వచ్చిపడ్డాయె నా తల్లి! మా చిన్ననాడు యిలాటి రాలిబాటు యెరగం. అదేంత్తో సినీమాలో గుంట డబ్బుకోసం రాలిబడ్డాదంటే, నువ్వూ అలాగ విరగబడతావటే? పులినిచూచి నక్క వాతలెట్టుకుంటే ఒళ్ళు కాలి చచ్చిందట అలాగవుంది నీపద్ధతి. ఆరు నెల్లు సావాసంచేస్తే వారు వీరవుతారని. వచ్చిన సినీమాలెల్లా తప్పిపోకుండా కొంప మునిగిపోయినట్టు చూస్తూవుంటే మరేమిటవుతుంది. ఇంటో కాస్తైనా మొగాడి భయం వుంటేనా మరి. సినీమాల్లో మంచి అబ్బక పోయినా చెడ్డమాత్రం అతి సులువుగా అబ్బేస్తుంది. అదేమిటే, నీ ఖర్మంకాల! ఇంట్లో రవికలు లేవా? గుడ్డకి కరువా? ఇదుగో చెపుతున్నాను విను. ఈమాటునుంచి అలాటి జాకెట్లు తొడక్కున్నావంటే యింట్లో తిండి పెట్టను జాగ్రత్త అని నాలుగు అడిపోసేప్పటికి యిప్పుడాపద్ధతి చాలామట్టుకు మానేశారు.

గుణసుందరిలో శ్రీరంజని మహా పతివ్రతలాగ నటించిందంటే, ఆమెలాగే మనం పాతివ్రత్యం కలిగివుండాం, రోజూతులసిమొక్కకి పూజచేదాం అని యెవరూ అనుకోరు. కీలుగుఱ్ఱంలో అంజలీదేవి తిప్పుకుండంటే ఆమెలాగే మనం త్రిప్పుకుంటూ నడుద్దాము. అదీ ఒక అందమే అనుకుంటారు కాని ఆమె సినీమాలో తాత్కాలికంగా అలాగ నటించింది గాని నిత్యం యింట్లోకూడా అలాగే ప్రవర్తిస్తుందా యేమిటి? అని యెవరూ ఆలోచించుకోరు.

ఈమధ్యను నా క్లాసుమేటు కామాక్షి లైలామజ్నూ సినీమాచూసిందగ్గరనుంచి విరహతాపం అవలంబించింది. అయితే ఆమె తప్పేమీలేదు లెండి. ఈడొచ్చినా పిల్లలకి పెళ్ళిచేయకపోతే మరేంచేస్తారు. మనస్సులో యేదో ఆలోచించుకుంటూ కుమిలిపోయి కూర్చోవడమేగాని క్లాసులో పాఠాలంటూ వినడంవుంటేనా! లెక్చరరు గోల లెక్చరరుది, మనగోల మనది ఐతే ఎప్పటికీ అలాటి పిట్టలు యెగిరిపోక మానవురా అన్నాడు నామిత్రుడు శర్మ. అదేమిటో కామాక్షికి భానుమతిని చూచినదగ్గరనుంచి ఆమెలాగే తనూ వుండాలని కాబోలు. భానుమతిలాగే క్రాఫింగు దువ్వుకొని, దుస్తులు ధరించుకొని వయ్యారంగా నడుస్తూ క్లాసుకు వస్తుంది. ఇంతకీ ఎన్ని అంగలు కూర్చుకుంటే కామాక్షి భానుమతి అవుతుంది? నక్కయెక్కడ నాగలోక మెక్కడ? ఆమె సినీమాల్లో నటించి లక్షలు గడిస్తూవుంటే, ఈమె యింట్లోవున్న డబ్బంతా తగలెట్టి యిమిటేషన్ పద్ధతులు నేర్చుకుంటోంది. అయితే కాలేజీ విద్యార్థులు వూరుకుంటారా! ఆడగుంట అనువుగా కనబడితే చాలు టైటిల్సు యివ్వటానికి. పెధవది లెక్చరర్సుకే కమ్మలు కడుతూవుండే యీ కుర్రకుంకలికి, యీగుంట నక్కలు ఓ లెక్క! మాక్లాసులో శర్మగాడు వున్నాడుగా, వాడు యెవరికైనా టైటిల్సు యివ్వటంలో నిపుణుడు. కామాక్షికి 'ఇమిటేషన్ భానుమతి' అని ఇట్టే టైటిలు పారేసేడు. ఆపేరు కాస్త కాలేజీఅల్లా అలుముకు పోయింది. ఏగోడమీద చూచినా ఆమెపేరే. గరల్స్‌రూమ్ గోడలనిండా ఆమె పేరే చిత్రించబడివుంది. నూతన తార ఇమిటేషన్ భానుమతి అని. కాలేజి వదిలినతరువాత విద్యార్థులంతా శునకాలలాగ ఆమె వెనకపడ్డం మొదలెట్టారు కేకలు వేసుకుంటూను. ఎవరెన్ని మాటలన్నా ఆమెమాత్రం వెనక్కి తిరిగిచూచేది కాదు. మనస్సులో ఉదాసీనం పడేది కాదు. ఎప్పటికైనా నేను భానుమతిలాగ వుండకపోతానా అని కాబోలు ఆమె వుద్దేశం.

కుక్కయెన్నిసార్లు గోదావరిలో మునిగితే గంగగోవు అవుతుంది? పాపం! ఇలాగ ప్రతీ విద్యార్థి ఆమెను హేళనచేస్తూవుంటే నేను చూచి సహించలేకపోయినాను. నా సన్నిహితురాలిని, మాయింట్లోనే కాపురం వుంటున్న నా కామాక్షిని ఆ కామాంధులు అలా దూషించటం నాకు చాలా అవమానకరంగావుండి ఒకనాడు అడిగేశాను.

కామాక్షి! యీ ఇమిటేషన్ నాకేమి బాగులేదు. నీ సహజమైన రూపలావణ్యం చెడగొట్టుకొని, యెక్కడో భానుమతిలాగ అయిపోదాం అంటే అవగలవా! ఉత్తది. చక్కగా నువ్వు గుత్తగుత్తలజాకెట్టు, కోయంబత్తూరు చీరకట్టుకొని, షెమ్సుజోళ్ళు తొడుక్కొని టిక్కుటిక్కుమని కాలేజీకి వస్తే ప్రతీవిద్యార్థి నిన్నుచూసి, దిగ్భ్రాంతుడై నాలికలు చప్పరిస్తూ కూర్చుంటారు. అటువంటిది ఇప్పుడు ప్రతీ స్టూడెంటు నిన్ను ఇమిటేషన్ భానుమతీ అని హేళనచేస్తున్నారు, ఇదుగో యికనైనా ఆ అనుకరణలు మానేసి. నీ సహజమైన అందాన్ని మెరుగులు దిద్దుకో అని అన్నాను.

కామాక్షి కూడా చదువుకుంటూవున్నదే కాబట్టి నామాటలకి జవాబు యివ్వకుండా వూరుకోలేక పోయింది. ఓయ్! రావ్! ఎందరో మహామహాకవులని చెప్పుకొని కొయ్యబొమ్మల్లాగ మీసాలు తిప్పుకుంటున్నవాళ్ళే యీనాడు అనుకరణపద్ధతుల్లో రచనలు సాగిస్తున్నారు. అటువంటిది నేనొక సినీమాతారను అనుసరించటం బాగులేకపోవడం ఏమిటి? క్రిందటికి ఒక కవి అన్నట్టు, జగమంతా చిత్రనాటకము, తోలుబొమ్మలతో నే ఆట, లేకపై బొమ్మలతో నే ఆట అని. ఈ ప్రపంచమంతా భగవంతుని లీల. అతను మనల్ని ఇలాగ ఆడిస్తున్నాడోయ్ అంది. అంతే గుప్‌చుప్.